# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మొంథా తుఫాన్‌ను సమిష్టి కృషితో సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టంపై పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రులు ప్రైవేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన సేవలు అందిస్తున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**

4. **శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**

5. **శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుంది.**

==========================

మొంథా తుఫాన్‌ను సమిష్టి కృషితో సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మొంథా తుఫాను సమయంలో ఉత్తమ సేవలందించిన వారికి అభినందన కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ… తుఫానుపై సమాచారాన్ని ముందుగానే అంచనా వేసి ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. సాంకేతికతతో పాటు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహకరించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెబుతూ..

వాయిస్ ..29 సెకన్లు

---------------------------

మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టంపై పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలో మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూతూ.. రైతులు నష్టపోకుండా సమగ్రంగా సర్వే చేసి పంట నష్టం అంచనా వేయాలని అధికారులకు సూచించారు.

---

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో  కొందరు భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా.. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ  ఘటనపై హోంమంత్రి వి.అనిత జిల్లా ఎస్పీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి... ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. సహాయ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు.

---

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత  ప్రైవేట్ ఆస్పత్రుల కంటే ప్రభుత్వాసుపత్రులు మెరుగైన సేవలు అందిస్తున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆన్‌లైన్ సేవలను ఆయన నిన్న సాయంత్రం ప్రారంభించారు. ప్రభుత్వం వైద్యరంగంలో సాంకేతికత  వినియోగించి రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని  మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలుపుతూ..

వాయిస్.. 26  సెకన్లు

---

ఏలూరు జిల్లా వేలేరుపాడులో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు భూసేకరణ, పునరావాస పరిహారంలో భాగంగా వెయ్యి కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందజేయడం ఇది రెండవసారి.

---

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. తలుపుల మండలం పెద్దన్నవారి పల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అనంతరం అక్కడ జరిగే ప్రజా వేదికలో ఆయన ప్రసంగిస్తారు. మధ్యాహ్నం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

---

ఎలాంటి విపత్తులు వచ్చిన ఒకటవ తేదీనే పింఛన్లు అందజేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఆయన ఈరోజు అందజేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంవత్సరానికి  32వేల 500 కోట్ల రూపాయలను పింఛన్ల కోసం అందజేస్తున్నట్లు  ఈ సందర్భంగా మంత్రి  తెలిపారు.

---

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపాలిటీ 17వ వార్డు వెలమపేటలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం, అనంతపురం, పల్నాడు జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొని పింఛన్లు అందజేశారు.

---------------------------

బిర్సా ముండా జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జన జాతీయ గౌరవ దివాస్ మహోత్సవాలను ఈరోజు నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుమణి శ్రీ పూజ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాఫీ హౌస్ వద్ద మొక్కలు నాటడం, బిర్సా ముండా చిత్రపటానికి, గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు పూలమాలతో నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర గిరిజన సమరయోధులు, సాంఘిక సమస్యలపై పోరాడే గిరిజన సంఘ సంస్కర్తలు ఎవరైతే గుర్తింపులేకుండా ఉన్నారో వారందరి గురించి పురస్కరించుకొని భవిష్యత్తు తరాలకు తెలిపే విధంగా జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

అమర వీరుల త్యాగాలు దేశ ఐకమత్యం, సమగ్రతకు పునాదని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉద్ఘాటించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ అమర వీరుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిన్న సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణలో అమర వీరుల త్యాగాలు కీలకమని, వారి స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు.

---------------------------

గోవాలో ఫిడే చెస్ ప్రపంచకప్ ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. 80 దేశాల నుంచి 206 మంది ప్రముఖ క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో తలపడబోతున్నారు. నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీలను క్లాసికల్ పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రతి రౌండ్‌కు రెండు గేమ్‌లు ఉంటాయి. ఈ కప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచే ప్లేయర్లు 2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధిస్తారు.

---------------------------

రాష్ట్రంలో మొంథా తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు తక్షణమే బృందాలను పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. ఈ మేరకు తుఫాను నష్టానికి సంబంధించిన ప్రాథమిక అంచనాలను వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కేంద్రానికి నివేదిక పంపారు. ఈ నివేదికలో 5 వేల 244 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అయితే, ఇది ప్రాథమిక అంచనాల మేరకే అని, పూర్తి వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఈ మేరకు శాఖల వారీగా ప్రాథమిక అంచనాలను నివేదికలో వివరించారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని 249 మండలాల్లోని 1 వెయ్యి 434 గ్రామాలు, 48 పట్టణాలపై

తుపాను ప్రభావం పడినట్టు, 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 19 సెకన్లు

=====================